సాక్షి
సంగారెడ్డి

శనివారం : 24 : మే : 2025



శుక్రవారం జహీరాబాద్‌లో జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ క్రాంతి, మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం



సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సలహాలు సూచనలకు శనివారం ఉదయం 10.30 నుంచి 11.30 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రయాణికులు 99592 26267 నంబర్‌కు సంప్రదించవచ్చని సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

పురుషులకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: పురుషులకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని 18 నుంచి 45 ఏళ్ల పురుషులు ఈ నెల 31 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు సంగారెడ్డి బైపాస్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం, 97044 46956, 94901 29839 సంప్రదించాలని సూచించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేస్తామని పేర్కొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయండి

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

సంగారెడ్డి: తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఈ నెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్న ''జర్నలిస్టు జాతర''రజతోత్సవ సభకు ఉమ్మడి మెదక్ జర్నలిస్టులందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని తెంజూ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. సంగారెడ్డిలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్‌ను ఫోరం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు శ్రీధర్, పరశురాం, యోగానంద రెడ్డి, సునీల్, శ్రీనివాస్, రాము, నాని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గదుల నిర్మాణానికి రూ.50లక్షలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం శివనగర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి న్యూలాండ్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి రూ.50 లక్షలు మంజూరు చేస్తూ అనుమతులిచ్చినట్లు మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ..గతేడాది పాఠశాలలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాఠశాల సమస్యను వివరించారు. ఈ మేరకు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతూ సహకారం అందించడం పట్ల ఆయనకు, పరిశ్రమ యాజమాన్యానికి గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. పనులు త్వరలోనే ప్రారంభం కానున్నట్లు వారు పేర్కొన్నారు.

బస్సులు నడపండి.. బాధలు తీర్చండి



సురేఖ, డీఎం

మెదక్ మున్సిపాలిటీ: పలు రూట్లలో బస్సులు నడపాలని కోరుతూ పలువురు ప్రయాణికులు శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు విన్నవించారు. మెదక్ నుంచి వెల్దుర్తి మీదుగా రేగోడ్‌కు, మెదక్ నుంచి టేక్మాల్, బొడ్మట్‌పల్లి మీదుగా జోగిపేట, సంగారెడ్డి. పటాన్‌చెరుకు, అలాగే ఉదయం 6 గంటలకు మాచారం మీదుగా జేబీఎస్ వరకు, టేక్మాల్ నుంచి నర్సాపూర్‌కు బస్సు నడపాలని కోరారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ సురేఖ ప్రయాణికుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు.

సమానత్వం కోసం ఉద్యమిద్దాం

నిజాంపేట (మెదక్): అన్నిరంగాల్లో సమానత్వం కోసం ఉద్యమించాలని మహిళా రైతు హక్కుల వేదిక రాష్ట్ర నాయకురాలు, సామాజిక కార్యకర్త ఆశాలత పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇప్పటికీ 65 శాతం దళిత మహిళలు భూమి లేని కూలీలుగా ఉన్నారని, వారికి సామాజిక భద్రత కరువైందన్నారు.

నిమ్జ్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

పట్టాలిచ్చే ప్రత్యేక బాధ్యత జగ్గారెడ్డికి అప్పగిస్తున్నా

- కో-ఆపరేటివ్ సెక్టార్‌లో చక్కెర పరిశ్రమ
- త్వరలో హుందాయ్ కార్ల పరిశ్రమ పనులు ప్రారంభం
- సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి
- సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలకు నిధులు
- బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నిమ్జ్‌లో భూములు కోల్పోతున్న 5,612 నిర్వాసిత కుటుంబాలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. ఈ నిర్వాసితులకు పట్టాలు అందించే బాధ్యతను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అప్పగిస్తున్నానన్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం రూ.494 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు. 2014 తర్వాత మెదక్ జిల్లాతో పాటు, నిమ్జ్ అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. నిమ్జ్ నిర్వాసితుల సమస్యలను మంత్రి దామోదర రాజనర్సింహ తన దృష్టికి తెచ్చారని, వెంటనే అధికారులను పిలిచి నిర్వాసితులకు న్యాయం చేసేలా నష్టపరిహారం పెంచాలని ఆదేశించామన్నారు. జంట నగరాలకు తాగునీరు, ఉమ్మడి మెదక్ జిల్లాకు సాగునీరు అందిస్తున్న సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలను ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి వీటికి నిధులు కేటాయిస్తామని చెప్పారు.

సహకార రంగంలో చక్కెర కర్మాగారం..

జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు రైతుల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సహకార రంగంలో చక్కెర కర్మాగారం ఏర్పాటుకు అవసరమైన పదెకరాల భూమిని నిమ్జ్‌లో కేటాయించే బాధ్యత తీసుకుంటానన్నారు. ఇక్కడ పది లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన చక్కెర కర్మాగారం ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హుందాయ్ ఇదే నిమ్జ్‌లో తన యూనిట్ స్థాపన పనులను త్వరలోనే ప్రారంభిస్తుందని తెలిపారు. ఈ కంపెనీకి 450 ఎకరాలు భూమిని కేటాయించామన్నారు. జిల్లాలోని రెండు జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అండర్ పాస్‌ల నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తీసుకువస్తానని స్పష్టం చేశారు.

ఆదర్శనీయుడు బసవేశ్వరుడు

గౌతమ బుద్ధుని తర్వాత బసవేశ్వరుడు ఆదర్శనీయుడని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ రోజుల్లో అనుభవ మండపాలను ఏర్పాటు చేసి అన్ని సామాజికవర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చేసిన విశ్వగురువు బసవేశ్వరుడన్నారు. అప్పటి అనుభవ మండపాల మాదిరిగానే ఇప్పుడు అసెంబ్లీ.. పార్లమెంట్‌లను నిర్వహించుకుంటున్నామన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధిపై త్వరలో సమీక్ష

జిల్లాలోని జహీరాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై త్వరలో సమీక్ష నిర్వహిస్తామని సీఎం పేర్కొన్నారు. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యను పరిష్కరించి ఈ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలని ఎన్నికలయ్యాక అందర్నీ కలుపుకుని పోతామన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీకి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. 150 ఎకరాల భూమిని కేటాయించి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామన్నారు. చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఇచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇందిరమ్మకు మెదక్‌తో విడదీయలేని అనుబంధం..

మెదక్ ప్రాంతానికి ఇందిరమ్మకు విడదీయలేని అనుబంధం ఉందని రేవంత్ పేర్కొన్నారు. ఇందిరమ్మ తన చివరి శ్వాస వదిలేవరకు మెదక్ ఎంపీగా కొనసాగారని గుర్తు చేసుకున్నారు. మాజీ ఎంపీ భాగారెడ్డి, ఈశ్వరీబాయిలను ఈ ప్రాంత ప్రజలు గుర్తు చేసుకుంటారు. గీతారెడ్డి హయాంలోనే జహీరాబాద్‌కు నిమ్జ్ మంజూరు చేయించారని పేర్కొన్నారు. మినీ ఇండియాగా పేరున్న పటాన్‌చెరు ప్రాంతంలో బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, ఇక్రిశాట్, నిమ్జ్ ఇవన్నీ కాంగ్రెస్ అధికారంలో వచ్చినవేనని గుర్తు చేశారు. ఈ అభివృద్ధిని భవిష్యత్తులో ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకుంటామన్నారు. మెదక్ సాగు, తాగునీరు, పరిశ్రమల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు.



బహిరంగ సభకు హాజరైన మహిళలు

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- రూ.100 కోట్లతో నిర్మించిన ఆర్వోబీ జాతికి అంకితం
- నిమ్జ్ రహదారి కూడా..

జహీరాబాద్ టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.100 కోట్ల వ్యయంతో జహీరాబాద్ సమీపంలో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)ని జాతికి అంకితం చేశారు. హుగ్గెల్లి నుంచి బర్దిపూర్ వరకు రూ.173 కోట్లతో నిర్మించిన సుమారు 9 కిలో మీటర్ల పొడవైన నాలుగులేన్ల రహదారిని కూడా ప్రారంభించారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి నీటి సరఫరా కోసం అమృత్ 2.0 పథకం కింద రూ.66 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. సంగారెడ్డి జిల్లాలో 2,485 హెక్టార్లలో అటవీ ప్రాంత అభివృద్ధి కోసం అర్బన్ ఫారెస్టు పార్కుల అభివృద్ధి పనులకు, రూ.6.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్మాణానికి కూడా సీఎం శంకుస్థాపన చేశారు. మాచునూర్ వద్ద నిర్మించిన కేంద్ర విద్యాలయం నూతన భవనాన్ని ప్రారంభించారు. కోహీర్ మండలంలోని కవేలి చౌరస్తాలో మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించనున్న పెట్రోల్ బంక్ అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. జిల్లాలోని మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.126 కోట్ల బ్యాంక్ రుణాల చెక్కును అందజేశారు. నిమ్జ్ భూబాధితులైన 564 మందికి రూ.64 కోట్ల నష్టపరిహారం చెక్కులను అందజేశారు. జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి-ఇప్పపల్లి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. జహీరాబాద్ పట్టణ సమీపంలో హుగ్గెల్లి చౌరస్తాలో రూ.60 లక్షల డీఎంఎఫ్టీ, సీడీపీ నిధులతోపాటు బసవ భక్తుల ఆర్థిక సహాయంతో ప్రతిష్ఠించిన అశ్వారూఢ బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు.


మహిళలను కోటీశ్వరుల్ని చేస్తాం

మంత్రి కొండా సురేఖ



సంగారెడ్డి జోన్: ప్రతీ మహిళను కోటీశ్వరుల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమంలో మహిళలను భాగస్వామ్యం చేస్తూ ముందుకు వెళ్తుందన్నారు. వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించి, ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా మహిళా సంఘాలకు రుణాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. త్వరలో పెట్రోల్ బంక్ నిర్వహణ కూడా మహిళలే నిర్వహించబోతున్నారని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందేందుకు ప్రభుత్వ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి: మంత్రి దామోదర



గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో రైతులు అనేక భూ సమస్యలు ఎదుర్కొన్నారని, వాటిని పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి పరిష్కారం దిశగా కృషి చేస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్రంలో కులగణన ప్రక్రియ చేపట్టి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. అప్పటి కాంగ్రెస్ హయాంలో మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డికే దక్కిందన్నారు. హైదరాబాద్ తర్వాత అభివృద్ధి జరిగేది జహీరాబాద్ ప్రాంతమేనని వెల్లడించారు. సింగూరు ప్రాజెక్టు అయినా, ఇండస్ట్రియల్ జోన్ అయినా తీసుకొచ్చిందని కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు.

లక్ష ఎకరాలకు సాగు నీరు: ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ ప్రాంతంలో చెరువులు, నదులు లేకపోవటంతో సాగు, తాగు నీటి అవసరాలకు సంగమేశ్వర ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సీఎం రేవంత్‌ను కోరారు. జహీరాబాద్ ప్రాంతంలోని రైతులు అధికశాతం చెరకు, ఆలు, అల్లం తదితర వాణిజ్య పంటలను పండిస్తుంటారని చెప్పారు. లక్ష ఎకరాలకు నీరందించే సంగమేశ్వర ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని రోడ్లు అధ్వాన్నంగా తయారైయ్యాయని, రోడ్ల మరమ్మతులకు రూ.72 కోట్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం గ్రామ పంచాయతీలకు రూ.20లక్షలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి నిరంతరం కొనసాగాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి దిశగా: ఎంపీ షెట్కార్



జహీరాబాద్ నియోజకవర్గ పారిశ్రామిక అభివృద్ధి రంగంలో దూసుకుపోతోందని ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జహీరాబాద్ ప్రాంతానికి నిమ్జ్ వచ్చిందని గుర్తు చేశారు. ప్రారంభంలో మూడు వేల ఎకరాలు సేకరిస్తే, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో భూ సేకరణ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని విమర్శించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో భూ సేకరణ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రాబోయే పదేళ్ల కాలంలో ఇక్కడి ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. రూ. 250కోట్లతో 100 ఎకరాల విస్తీర్ణంలో చెరుకు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి: మాజీ మంత్రి చంద్రశేఖర్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని రంగాల అభివృద్ధి జరుగుతుందని మాజీ మంత్రి, నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జహీరాబాద్ గురించి పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి రాకతో జహీరాబాద్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అయ్యి, అభివృద్ధికి బాటలు పడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిమ్జ్ రైతుల ముందస్తు అరెస్టు

మామిడ్గిలో స్వల్ప ఉద్రిక్తత

న్యాల్‌కల్(జహీరాబాద్): నిమ్జ్ రైతుల ముందస్తు అరెస్టుతో మండల పరిధిలోని మామిడ్గిలో శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి జహీరాబాద్ పర్యటన సందర్భంగా నిమ్జ్ రైతులు అడ్డుకునే అవకాశమున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వేకువ జామున మామిడ్గి గ్రామానికి వెళ్లిన హద్నూర్ పోలీసులు గ్రామానికి చెందిన రాజిరెడ్డి, నాగన్న, సంజీవరెడ్డి, బుచ్చిరెడ్డి, వీరారెడ్డిలతో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా వాళ్లను ఎందుకు అరెస్టు చేస్తున్నారని వాగ్వివాదానికి దిగి పోలీసులను అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మీకు సీఎం దగ్గరకు తీసుకు వెళ్లి ఆయనతో మాట్లాడే అవకాశం కల్పిస్తామని నచ్చ జెప్పిన పోలీసులు రైతులను నేరుగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. మామిడ్గి గ్రామానికి చెందిన వారితోపాటు ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి, శంకర్ తదితరులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. సీఎం సమావేశం ముగిసిన తర్వాత వారిని వదిలి పెట్టారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులను కూడా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మల్గి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మారుతి యాదవ్, డప్పూర్‌కు చెందిన శివరాజ్, న్యామతాబాద్‌కు చెందిన శ్రీకాంత్, రేజింతల్‌కు చెందిన కుత్బుద్దీన్‌లను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు.



మామిడ్గిలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

నారాయణఖేడ్: అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గణపతి తెలిపారు. ఖేడ్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పర్యటన సందర్భంగా సీపీఎం, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని చెప్పారు. అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఇక్రిశాట్ శాస్త్రవేత్తలతో మాట్లాతున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం

- నాటి ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఇక్రిశాట్
- మారుతున్న పరిస్థితులకనుగుణంగా పరిశోధనలు
- రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం రైతుల మధ్యలో ఉంటూ రైతుల సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం పరిధిలోని మెట్టపాంత్రాల వ్యవసాయ పరిశోధన కేంద్రం(ఇక్రిశాట్)ను శుక్రవారం రైతు కమిషన్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..1972లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఇక్రిశాట్ ఏర్పాటు చేశారన్నారు. అందుకు ఇక్రిశాట్‌కు 3,500 ఎకరాల భూమిని కేటాయించినట్లు గుర్తు చేశారు. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా ఇక్రిశాట్ వ్యవసాయ పరిశోధనలు చేస్తోందని వివరించారు. సాంప్రదాయ పంటలను అభివృద్ధి చేసేందుకు ఇక్రిశాట్ సేవలు దోహదపడుతున్నాయన్నారు. తను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సైతం ఇక్రిశాట్ సందర్శించానని, ప్రభుత్వంతో కలసి కొనసాగిస్తున్న ప్రాజెక్టులపై సమీక్షించినట్లు గుర్తుచేశారు. తాము కూడా శాస్త్రవేత్తలకు పలు సూచనలు చేసినట్లు వివరించారు. మెట్ట పంటల అభివృద్ధి, విత్తన పరిశోధన, మట్టి ఆరోగ్యం, నీటి వినియోగం అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా.హిమాన్షు పతక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, వ్యవసాయ అధికారులు హరి వెంకట్‌ప్రసాద్, సురేశ్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు డా.హరికిషన్, డా.జానిలా పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను విరమించాలి

కేంద్రానికి వామపక్షాలు విజ్ఞప్తి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఆపరేషన్ కగార్‌ను విరమించి, మరణ హోమాన్ని ఆపాలని వామపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెహమాన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నక్సల్స్, ప్రశ్నించే గొంతులను, ఆదివాసులను అతిక్రూరంగా బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి మారణహోమాన్ని సృష్టిస్తోందన్నారు. మావోయిస్టులతోపాటు ఇతర విపక్షాలు, ప్రజా సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి శాంతి చర్చలు జరపాలని సూచించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపకుండా మావోయిస్టులను చంపడం అత్యంత హేయమన్నారు. ఈ మారణ హోమంలో మావోయిస్టులు, ఆదివాసులు, మిలిటరీ జవాన్లు కూడా చనిపోతున్నారని, ఇవన్నీ పట్టించుకోకుండా కేంద్రం నిరంకుశ వైఖరితో ఎన్‌కౌంటర్లు చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిగ్గూ ఎగ్గూ లేకుండా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని చెప్పడం ఫాసిస్టు నైజమని మండిపడ్డారు. మారణ హోమాన్ని ఆపకపోతే విపక్ష పార్టీలు ప్రజాస్వామ్యవాదులంతా ఏకమై దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చింత గంగయ్య, సయ్యద్ సమద్, మల్లేశ్, అసద్, తిరుమలేశ్, సమతా సైనికదళ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించిన సీపీఎం

సంగారెడ్డి: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని సీపీఎం సంగారెడ్డి ఏరియా కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలని ఆ పార్టీ నాయకుడు యాదగిరి సూచించారు. మావోయిస్టు రాజకీయాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, చర్చల కోసం వారు చేసిన విజ్ఞప్తులను పరిగణనలోకి అన్ని పారా మిలిటరీ కార్యకలాపాలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

డీఎల్‌పీఓ విచారణ
పంచాయతీ రికార్డులు సీజ్



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ

నంగునూరు(సిద్దిపేట): గట్లమల్యాల పంచాయతీ కార్యదర్శిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం డీఎస్‌పీఓ మల్లికార్జున్‌రెడ్డి విచారణ జరిపారు. పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్నులు ఇష్టారీతిగా వసూల్ చేస్తోందని, అనేక అక్రమాలకు పాల్పడుతోందని వారం రోజుల కిందట గ్రామస్తులు డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామంలో విచారణ చేపట్టారు. కార్యదర్శి ఇంటి నిర్మాణం కోసం డబ్బులు అధికంగా వసూల్ చేస్తోందని, పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఫిర్యాదుదారులు పలు ఆధారాలను డీఎల్‌పీఓకు అందజేయగా ఇంటి పన్ను బిల్లు బుక్కులు, నల్లా బిల్లులను పరిశీలించి రికార్డులను సీజ్ చేశారు.

ధర్మాజీపేటలో కుక్కల బీభత్సం
- గొర్రెల మంద, గేదె దూడలపై దాడి
- 4 గొర్రెలు, 2 దూడలు మృతి




కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె, దూడ

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులో గురువారం అర్ధరాత్రి కుక్కలు బీభత్సం సృష్టించాయి. గొర్రెల మంద, గేదె దూడల పై దాడి చేశాయి. ఈ దాడిలో పల్లె మల్లవ్వకు చెందిన 4 గొర్రెలు , కాస్తి స్వామి గేదె దూడ, గొల్ల రాజు గేదె దూడలు మృతి చెందాయి. తమ గొర్రెల విలువ సుమారు రూ. 60 వేల పైన ఉంటుందని బాధితురాలు మల్లవ్వ, గేదె దూడల విలువ సుమారు రూ. 30 వేల పైన ఉంటుందని బాధితులు స్వామి, రాజు వాపోయారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు. కుక్కలు పొలాల వద్ద, గ్రామాల్లో ఇష్టారీతిన తిరుగుతూ దాడులు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కుక్కల పై చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని శుక్రవారం మాజీ కౌన్సిలర్ బత్తుల స్వామి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అంధించారు.

తెలంగాణ సాహిత్య పరిషత్ పురస్కారాలు
ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సారస్వత పరిషత్ 82వ వార్షికోత్సవం సందర్భంగా 25న బాల సాహిత్య వేత్తలకు తెలంగాణ సాహిత్య పరిషత్ పురస్కారాలు అందించనున్నట్లు బాల సాహితీ వేత్త బస్వరాజ్ కుమార్ శుక్రవారం తెలిపారు. కేవీ రమణాచారి, డాక్టర్ పత్తిపాక మోహన్, ఆచార్య ఏలూరు శివారెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాల అందించనున్నట్లు తెలిపారు. బాల సాహిత్యంలో పలు గ్రంథాలు రాసిన జిల్లా బాల సాహిత్య వేత్తలు పెందోట వెంకటేశ్వర్లు, ఎన్నవెల్లి రాజమౌళి ఈ పురస్కారాలు అందుకోనున్నారు. ఈ సభ సందర్భంగా పెందోట వెంకటేశ్వర్లు రాసిన ''చెపితే సగం ఇవ్వాలి'' బాల కథ సంపుటి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. పురస్కారాలు అందుకోనున్న కవులను పెందోట బాల సాహిత్య పీఠం , శ్రీవాణి సాహిత్య పరిషత్, సుగుణ సాహితీ సమితి, అక్షర సేద్యం కార్యవర్గ సభ్యులు అభినందించినట్లు తెలిపారు.



పెట్రోల్ బంక్ వద్ద మహిళా సమాఖ్య సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి



జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ



వీడియో తీస్తున్న మహిళ



దామోదర రాజనర్సింహతో మాటామంతి



జగ్గారెడ్డితో మాట్లాడుతూ..



కలెక్టర్ వల్లూరు క్రాంతితో మాట్లాడుతున్న సీఎం



సమావేశానికి వస్తున్న మహిళలు



విద్యార్థులను పలకరిస్తూ..



జనాలకు నీళ్ల ప్యాకెట్లు అందజేస్తున్న కార్యకర్తలు

సీఎం సభ సైడ్ హైలెట్స్
- బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 12:30 గంటలకు జహీరాబాద్‌కు హెలికాప్టర్‌లో చేరుకున్నారు.
- రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ సురేష్ షెట్కార్, కార్పొరేషన్ చైర్మన్లు నిర్మలారెడ్డి, గిరిధర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, మాజీ మంత్రి చంద్రశేఖర్‌తోపాటు కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికార యంత్రాంగం పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.
- హుగ్గెల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన విశ్వగురు బసవేశ్వరుడి విగ్రహాన్ని 12:45 గంటలకు వీరశైవ లింగాయత్ సభ్యులు, మంత్రులతో కలిసి ప్రారంభించారు.
- ఝరాసంగం మండలం మాచ్నూర్ గ్రామ శివారులో నిర్మించిన కేంద్రీయ విద్యాలయంకు 12:56 గంటలకు చేరుకున్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు ముఖ్యమంత్రికి గౌరవ వందనం చేసి స్వాగతం పలికారు. అనంతరం విద్యాలయ భవనాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగారు.
- అక్కడి నుంచి నేరుగా 1:20 గంటలకు పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంతోపాటు శంకుస్థాపన చేశారు. అదే విధంగా మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు.
- సభా వేదిక పైకి 1:41 గంటలకు ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, ఎంపీ ఎమ్మెల్యేలు చేరుకున్నారు.
- వేదికపై మంత్రులతో పాటు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, రాష్ట్ర గేయాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- రేవంత్ రెడ్డి ప్రసంగం ప్రారంభంలో అభిమానులు, ప్రజలు కేరింతలు వేశారు. జగ్గారెడ్డి పేరు పలకగానే మరోసారి కేరింతలు వేశారు.
- సభలో ముఖ్యమంత్రి సుమారు 30 నిమిషాలు ప్రసంగించారు. అనంతరం 2:50 గంటలకు హెలికాప్టర్ ద్వారా తిరుగు ప్రయాణం అయ్యారు.

శిక్షణ.. ఉపాధికి నిచ్చెన
- యువతకు అండగా నిలుస్తున్న సెట్విన్ కేంద్రం
- అందుబాటులో పలు కోర్సులు
- జాబ్ మేళాల నిర్వహణతో ఉద్యోగ అవకాశాలు



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సంగారెడ్డి క్రైమ్: ఔత్సాహికులైన పట్టణ యువత, మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ అండగా నిలుస్తోంది జిల్లా కేంద్రంలోని సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ ట్విన్ సిటీస్)శిక్షణ కేంద్రం. పట్టణంలో ముఖ్యంగా మహిళలకు ఉపయుక్తంగా ఉండేలా శిక్షణ ఇవ్వడంపై సెట్విన్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సాధిస్తున్నారు. ఫలితంగా ఇటి వద్దే వివిధ రకాల వృత్తి వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంది.

మరింత విస్తృతం

సెట్విన్ కేంద్రాన్ని ఆరేళ్ల కిందట ఆరు కోర్సులతో జిల్లా కేంద్రంలో ప్రారంభించారు. ప్రస్తుతం మరిన్ని కోర్సులను అందుబాటులకు తెచ్చి సేవలు విస్తృతం చేసేందుకు సెట్విన్ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారు. కోర్సుల తీరును బట్టి మూడు నుంచి 12 నెలల డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. కోర్సులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయోమెట్రిక్ పద్ధతిలో తీసుకుంటున్నారు.

శిక్షణకు కావాల్సిన అర్హతలు
- పదో తరగతి మొదలు పీజీ వరకు చదివిన అభ్యర్థులకు కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు.
- ఒక బ్యాచ్‌కు 300 మంది అభ్యర్థుల చొప్పున శిక్షణ ఇచ్చేందుకు కేంద్రంలో వసతులున్నాయి.
- ప్రతీ సంవత్సరం 1000 మందికి పైగా శిక్షణ పొందుతున్నారు.
- శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేయడంతోపాటు ప్రతీ సంవత్సరం జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

అందుబాటులో ఉన్న కోర్సులు
- విద్యా అర్హత, ఆసక్తి ప్రతిపాదికన వివిధ కంప్యూటర్ కోర్సులతోపాటు, సాంకేతిక కోర్సుల్లో ఇక్కడ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, రీటేయిల్ సేల్స్ అసోసియేట్స్, ఫీల్డ్ టెక్నీషియన్, నెట్ వర్కింగ్, స్టోరేజీ, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఉపాధి ఉద్యోగ అవకాశాలు

"జిల్లా కేంద్రంలోని సెట్విన్ కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయి. శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాల కోసం జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నాం. వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన వారికి బ్యాంక్ ద్వారా రుణాలు అందించేందుకు సహకరిస్తున్నాం. – శివ కుమార్, సెట్విన్ ఇన్‌చార్జి"

విద్యార్థులను తీర్చిదిద్దే నిలయాలు కేవీలు



కేంద్రీయ విద్యాలయంలో చిన్నారులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ షెట్కార్, కలెక్టర్ క్రాంతి, ఎమ్మెల్యేలు, తదితరులు

కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే నిలయాలు కేంద్రీయ విద్యాలయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచ్‌నూర్ గ్రామ శివారులో రూ.26 కోట్ల వ్యయంతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ప్రారంభించారు. అనంతరం కాసేపు అక్కడి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. నూతన భవనం ప్రారంభోత్సవంతో విద్యార్థులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ సునీతా పాటిల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావుపాటిల్, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు
- ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహణ
- పలు టెండర్లు వాయిదా



టెండర్ బాక్స్ ఓపెన్ చేస్తున్న ఆలయ సిబ్బంది

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలం పాటలు ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. టెండర్లలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఎల్లమ్మ ఆలయం వద్ద వస్త్రాలు ఒడి బియ్యం సేకరించుకునే హక్కును రూ.18,30,000కు సనాది వెంకటేశ్ అధిక పాట పాడి దక్కించుకోగా ఆలయ పరిసరాల్లో పాదరక్షలను భద్రపరుచుకునే హక్కు లైసెన్సను రూ.15 లక్షలకు సనాది కరుణాకర్ దక్కించుకున్నారు. కూరగాయలు సప్లయ్ చేసే హక్కు టెండర్ చల్లా మౌనిక ఆలయం కోడ్ చేసిన ధర కంటే తక్కువ కోడ్ చేసి దక్కించుకున్నారు.

పలు టెండర్లు వాయిదా..

మల్లన్న ఆలయంలో కొబ్బరి కాయలు, ముక్కల సేకరణ, తలనీలాల సేకరణ, ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయల విక్రయం, కోర మీసాలు, మొక్కుబడి వస్త్రాలు, ఎల్లమ్మ ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్ విక్రయం, టాయిలెట్స్ నిర్వహణ, ప్రసాదం తయారీ, పాలు పెరుగు, పూల దండల సరఫరా, ఫొటోలు, వీడియోలు, బుక్స్ ప్రింటింగ్‌ల కోసం నిర్వహించిన టెండర్లలో సరియైన షెడ్యూల్స్, పాట రాకపోవడంతోఆలయ అధికారులు టెండర్లను వాయిదా వేశారు. ఈ టెండర్లకు తిరిగి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, శ్రీనివాస్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఆలయ ఉద్యోగులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కన్న తల్లే హత్య చేసింది
- వీడిన పసికందు కిడ్నాప్ మిస్టరీ
- కన్న కొడుకును బావిలో వేసి ఆపై కిడ్నాప్ డ్రామా..
- భర్తతో ఉండటం ఇష్టం లేకనే ఘాతుకం
- వివరాలు వెల్లడించిన సీఐ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

దుబ్బాక: మావనత్వం మంటగలిసింది.. నవమాసాలు మోసి.. పేగు తెంచుకొని పుట్టిన రెండు మాసాల పసికందును ఆ కర్కశ తల్లి బావిలో వేసి కడతేర్చింది.. ఆపై తన బిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారంటూ డ్రామాకు తెరలేపింది.. అనుమానం వచ్చిన పోలీసులు ఆ కర్కశ తల్లిని అదుపులోకి తీసుకొని విచారించగా తానే బావిలో వేసి చంపానంటూ ఒప్పుకుంది. ఈ అమానుషమైన ఘటనకు సంబంధించి శుక్రవారం దుబ్బాక సీఐ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. సిద్దిపేట మండలం పుల్లూరుకు చెందిన రామగల శ్రీమాన్, నంగునూర్ మండలం నర్మెట్టకు చెందిన కవిత మూడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసకున్నారు. వీరికి రెండు నెలల కిందట కుమారుడు పుట్టడటంతో దీక్షిత్ కుమార్ పేరు పెట్టారు. భర్త శ్రీమాన్ దొంగతనం కేసుల్లో రెండు సార్లు జైల్‌కు వెళ్లడం.. తనను సరిగ్గా చూసుకోకుండా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తూ రావడంతోపాటు తల్లిదండ్రులకు దూరం కావడంతో కవిత కొద్ది రోజులుగా మానసికంగా కుంగిపోతూ వస్తుంది. భర్తతో ఉండటం ఇష్టం లేక కవిత ఎలాగైనా వదిలించుకోవాలనుకుంది. పది రోజుల కిందట అత్తగారిల్లు పుల్లూరులో గొడవపడి శ్రీమాన్ అమ్మమ్మ గారింటికి దుబ్బాక మండలం అప్పనపల్లికి వచ్చారు. శ్రీమాన్ 17వ తేదిన పని నిమిత్తం రుద్రారం గ్రామానికి వెళ్లి అక్కడే ఉన్నాడు. భర్తతో ఉండటం ఇష్టం లేక ఎలాగైన వెళ్లిపోవాలని నిర్ణయించుకుంది. ఇందుకు రెండు నెలల పసికందు దీక్షిత్ అడ్డుగా ఉన్నాడని భావించి ఓ పథకాన్ని వేసింది.

కిడ్నాప్ డ్రామా..

ఈ నెల 21న మధ్యాహ్నం 2 గంటల సమయంలో దీక్షిత్‌ను బావిలో పడేసింది. ఏం తెలియనట్లుగా ఇద్దరు వ్యక్తులు వచ్చి తన బిడ్డను ఎత్తుకెళ్లారంటూ కిడ్నాప్ డ్రామా ఆడి తన భర్తతో కలిసి బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె మాటలు, ప్రవర్తన పట్ల అనుమానం వచ్చి కవితను అదుపులోకి తీసుకొని విచారించగా తనకు భర్తతో ఉండటం ఇష్టం లేకనే పసికందును బావిలో వేసినట్లు తెలపడంతో గురువారం బావిలో గాలించి పసికందు మృతదేహాన్ని వెలికితీసినట్లు సీఐ తెలిపారు. ఈ వ్యవహారంలో శ్రీమాన్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కవితను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు : సీపీ
సిద్దిపేటకమాన్: ఆదివారం జరుగనున్న గ్రామ పాలన ఆఫీసర్స్ స్క్రీనింగ్ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉంటాయని సీపీ అనురాధ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకుపై నిబంధనలు అమల్లో ఉంటాయని, సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేసి ఉంచాలని తెలిపారు. 500 మీటర్ల దూరంలో ప్రజలు గుమిగూడి ఉండకూడదని తెలిపారు.

13 కిలోల గంజాయి స్వాధీనం
ఇద్దరు వలస కూలీలు అరెస్ట్



ఉత్తమ్ బర్మన్



తపన్ బిశ్వాస్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ బస్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తులను కొల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఉత్తమ్ బర్మన్, తపన్ బిశ్వాస్ జీవనోపాధి నిమిత్తం తెల్లాపూర్‌కు వలసొచ్చారు. స్థానిక నిర్మాణ రంగ సంస్థలో కూలీలుగా పని చేస్తున్నారు. ఇద్దరూ గంజాయి విక్రయించి డబ్బులు సంపాదించాలనుకున్నారు. బెంగాల్ ప్రాంతానికి చెందిన కృష్ణ విజయవాడ వరకు గంజాయిని తీసుకొచ్చాడు. అతడి వద్ద నుంచి వీరిద్దరూ 13 కిలోలు కొనుగోలు చేశారు. అక్కడ నుంచి తీసుకొచ్చి కూలీలకు విక్రయించేందుకు శుక్రవారం ఉస్మాన్‌నగర్‌లోని బస్టాండ్ వద్ద వచ్చారు. అనుమానాస్పదంగా కనిపించడంతో కొల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎండోమెంట్ భూములు కబ్జా
- ఆక్రమణకు గురవుతున్న వేణుగోపాల స్వామి ఆలయం భూములు
- నూతనంగా భవంతులు నిర్మాణం
- అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుల ఆరోపణ



ఆలయం చుట్టూ నిర్మించిన ఇల్లు

దుబ్బాకరూరల్: అక్రమ కబ్జాదారులు ప్రభుత్వ భూములే కాకుండా ఎండోమెంట్ భూములను కూడా కబ్జాకు పాల్పడుతున్నారు. దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం ఉంది. 417, 418 సర్వే నంబర్లలో 12 ఎకరాలు భూమి ఎండో మెంట్ పరిధిలో ఉంటుంది.దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ దాని చుట్టుపక్కల భూమి ఉన్న కొందరు 12 ఎకరాలపై కన్నేసి కబ్జాకు పాల్పడుతున్నారు. ఆ భూమిని ఆక్రమించడమే కాకుండా నూతనంగా భవనాలు నిర్మించారు. ఇప్పటికి కొంత మంది భవనాలు నిర్మిస్తూనే ఉన్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్తులు

దేవాలయ భూములు కబ్జాకు గురైతున్నాయని గ్రామస్తులు కలెక్టర్, దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎండోమెంట్ అధికారులు పలుమార్లు భూములను సర్వే చేశారు. భూములు కబ్జా చేసిన వ్యక్తులు కొంత మంది అధికారులకు మామ్ములు ఇస్తూ తమకు అనుకూలంగా చేయించుకుంటున్నారు. ఇదేమిటని గ్రామస్తులు అడిగితే భూములు సర్వే చేస్తున్నామని చెబుతున్నారే తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల సర్వే అధికారులు భూములను తూతూ మంత్రంగా సర్వే చేశారు తప్ప కబ్జా చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎండో మెంట్ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

భూములు కబ్జాకు గురయ్యాయి

మా గ్రామంలో వేణుగోపాలస్వామి దేవాలయం ఉంది. ఆలయం పరిధిలో 12 ఎకరాల భూమి ఉంటుంది. భూమిని కొంత మంది అక్రమంగా కబ్జాకు గురి చేశారు. ఈ స్థలంలో కొంత మంది అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారు. వాటిని తొలగించాలి. – కిషన్, హబ్సిపూర్ గ్రామస్తుడు

అధికారులు సర్వే చేశారు

దేవాలయ పరిధిలోని భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. ఎండోమెంట్ అధికారులు వచ్చి సర్వే చేశారు. సర్వే చేస్తే కొంత మంది నిర్మించుకున్న భవనాలు ఎండో మెంట్ పరిధిలోకి వచ్చాయి.
– రామకృష్ణ పంతులు, దేవాలయ అర్చకులు

నిర్మాణాలు చేపడితే కూల్చి వేస్తాం

గ్రామంలోని ఎండోమెంట్ భూములు కబ్జాకు గురైతున్నాయని గ్రామస్తులు మాకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు భూములు సర్వే చేస్తున్నాం. ఎండోమెంట్ భూముల్లో ఎవరైనా నిర్మాణాలు చేపడితే కూల్చి వేస్తాం.
– విజయలక్ష్మి, జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్